
సాక్షి
ఒడిశా

సోమవారం । 18 । నవంబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.7,13,038లు, బంగారం 2 గ్రాముల 390 మిల్లీగ్రాములు వెండి 59 గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



దేవుని భూములకు రక్షణ

పూరీ జగన్నాథుని భూములకు రక్షణ కల్పించనున్నారు. ఆ మేరకు కసరత్తు చేస్తున్నారు.

- 8లో



వణికిస్తున్న చలి

రాష్ట్రాన్ని చలి వణికిస్తోంది. ఉష్ణోగ్రతలు రానురాను పడిపోతున్నాయి.

- 8లో

న్యూస్‌రీల్

డంప్ యార్డ్‌లో విద్యార్థుల దుస్తులు, బూట్లు



బొయిపరిగుడ డంప్‌యార్డులో పడవేసిన బూట్లు, దుస్తులు

జయపురం: బొయిపరిగుడ సమితి కార్యాలయానికి ఒక కిలోమీటరు దూరంలో గల డంప్‌యార్డులో ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ పిల్లలకు దుస్తులు, బూట్లు పడేసి ఉండడం స్థానికంగా ఆశ్చర్యం కలిగించింది. అంగన్‌వాడీ, స్కూలు పిల్లలకు అందజేయాల్సిన దుస్తులు, బూట్లు పడేసిన విషయాన్ని సీడీపీఓ దృష్టికి తీసుకెళ్లగా దీనిపై దర్యాప్తు చేస్తామని అధికారి తెలిపారు. సకాలంలో పిల్లలకు దుస్తులు, బూట్లు అందజేయకుండా ఇలా తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకు డంప్‌యార్డులో పారబోసి ఉంటారని కొందరు అభిప్రాయపడుతున్నారు.

వరికుప్పలు దగ్ధం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మల్కన్‌గిరి: అగ్ని ప్రమాదంలో వరికుప్పలు దగ్ధమయ్యాయి. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి దోరగూడ పంచాయతీ మలిగూడ గ్రామంలో ఆదివారం ఉదయం ఏడు గంటలకు చోటుచేసుకుంది. ఐదు రైతు కుటుంబాలకు చెందిన వరిపంటను కోసేసి నూర్పుల కోసం కుప్పలు పెట్టి ఉంచారు. అయితే కుప్పలకు నిప్పు అంటుకొని మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలను అదుపుచేసే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. దీంతో చిత్రకొండ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది శకటంతో చేరుకొని మంటలను అదుపు చేశారు. చేతికి వచ్చిన పంట బూడిద కావడంతో రైతులు కన్నీరుమున్నీరుగా రోదించారు. అప్పుచేసి పెట్టుబడిపెట్టి సాగు చేసిన పంటను కోల్పోయామని..ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. ప్రమాద సమాచారం తెలుసుకున్న చిత్రకొండ తహసీల్దార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. పరిహారం అందిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు.

సుదర్శన్ పట్నాయక్‌కు అంతర్జాతీయ సత్కారం



థాయిలాండ్‌లో అంతర్జాతీయ సత్కారం అందుకున్న పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్

భువనేశ్వర్: ప్రముఖ సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్‌కు అంతర్జాతీయ సత్కారం లభించింది. థాయిలాండ్‌లో జరిగిన తొలి అంతర్జాతీయ ఒడియా సదస్సు పురస్కరించుకుని ఆయనకు ఈ గౌరవం లభించడం విశేషం. థాయిలాండ్‌లో భారత రాయబారి ముత్తు రామచంద్రన్ చేతుల మీదుగా ఈ సత్కారం అందుకున్నట్లు తెలిపారు.

బెత్తగుడ వద్ద ఓయూజే నూతన కార్యవర్గ సమావేశం



పర్లాకిమిడిలో గజపతి జిల్లా జర్నలిస్టుల యూనియన్ (ఓ.యు.జె.) నూతన కార్యవర్గ సమావేశం

పర్లాకిమిడి: గజపతి జిల్లా ఒడిశా యూనియన్ ఆఫ్ జర్నలిస్టుల కార్యవర్గ సమావేశం బెత్తగుడ వద్ద వనదుర్గా మందిరం వద్ద ఆదివారం జరిగినది. ఈ కార్యక్రమంలో గజపతి జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలు, భద్రతపై మాజీ కార్యదర్శి రూపేష్ సాహు మాట్లాడారు. అనంతరం సభ్యులంతా నూతన ఓ.యు.జె. నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. నూతన ఓ.యు.జె.(గజపతి జిల్లా) అధ్యక్షులుగా బసంత పండా, కార్యదర్శిగా ఆదర్శదాస్, సాధారణ కార్యదర్శిగా రూపేష్ సాహు, కోశాధికారిగా వాసుదేవ్ దాస్, న్యాయసలహాదారుగా రామగోవింద ఆచార్య, సువాగడ, రాయఘడ, కాశీనగర్ తదతర సమితి కార్యవర్గ సభ్యులుగా మరికొందర్ని ఎన్నుకున్నారు.

బడి.. గర్వంగా నిలబడి

- పీఎం శ్రీ పథకంలో జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు స్థానం


జయపురం:

జయపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు కేంద్ర ప్రభుత్వ పీఎంశ్రీ(ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో స్థానం లభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రకాశ్ పట్నాయిక్ ఆదివారం తెలిపారు. ఈ పథకం ద్వారా కేంద్ర విశ్వ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల పర్యవేక్షణలో 14,500 పీఎం శ్రీ పాఠశాలలు స్థాపించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో జయపురం ఉన్నత పాఠశాలను కూడా భాగం చేశారు. పీఎం శ్రీ పాఠశాలలో విద్యార్థులకు మంచి వాతావరణం సృష్టించటం, వారి శ్రేయస్సు కోసం సురక్షిత, సుసంపన్న విద్యాభ్యాస వాతావరణం నెలకొల్పడం, విద్యార్థులందరికీ మంచి భౌతిక, మౌలిక సౌకర్యాలు తదుపరి కార్యక్రమాలు పీఎం శ్రీ లక్ష్యం. 138 ఏళ్ల కిందట 1886లో ఆనాటి జయపురం మహారాజు శ్రీ రామచంద్ర దేవ్ ప్రారంభించిన ఈ చారిత్రక పాఠశాల 1910లో ఉన్నత పాఠశాలగా గుర్తింపు పొందిందని హెచ్ఎం తెలిపారు. ఆనాడు మద్రాస్ విశ్వ విద్యాలయ పరిధిలో ఉండేదని వెల్లడించారు. ఈ పాఠశాల ప్రథమ ప్రధాన ఉపాధ్యాయునిగా జి.రామదాస్ పంతులు ఉండేవారని వెల్లడించారు. ఆయన తర్వాత అనేక మంది ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల ఉన్నతికి కృషి చేశారని వెల్లడించారు.



ఆహ్లాదకర వాతావరణంలో నేటి పాఠశాల

ప్రత్యేక ఒడిశా ఏర్పాటు జరిగిన తర్వాత పాఠశాల ఆనాటి ఉత్కళ విశ్వవిద్యాలయ పరిధిలోకి వచ్చిందన్నారు. 1942లో జయపురం మహారాజు విక్రమదేవ్ వర్మ అందించిన ఆర్థిక నిధులతో భవనాలు, గ్రంథాలయం ఏర్పాటు జరిగిందని వివరించారు. అనంతరం పాఠశాల జిల్లా బోర్డు పరిధిలోకి వచ్చిందని తర్వాత రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలగా గుర్తింపు పొందిందని వెల్లడించారు. పట్టణ నడి బొడ్డున గల ఈ పాఠశాలకు సంబంధించి జయపురం మహారాజు బాలురకు సూర్యమహల్ కోటలో స్థలం కేటాయించారని, అయితే మహారాజు ఆకస్మిక మృతి కారణంగా అది నేరవేరలేదని తెలిపారు. 1960లో ఆనాటి ముఖ్యమంత్రి హరికృష్ణ మెహతాబ్, రాష్ట్ర ప్రభుత్వం సహకారంతో ఏనుగుల శాల సమీపంలో ఈ స్కూల్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎంతో మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని ఆయన వెల్లడించారు. ఇంతటి చరిత్ర గల ఈ పాఠశాల నేడు కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకంలో స్థానం సంపాదించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. దీనికి కారణమైన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



మొదటి పాఠశాల స్వరూపం



నేటి పాఠశాల అడ్మినిస్ట్రేట్ భవనం



పాఠశాల ప్రధాన మార్గం

పోరాట యోధుడు భక్షీపాత్రో



మాట్లాడుతున్న కరసుధా పట్నాయక్

జయపురం: అవిభక్త కొరాపుట్ గిరిజనుల హక్కుల సాధనకు, వారిని పోరాట బాటలో నడిపిన ప్రజా నేత స్వర్గీయ హరిశ్చంద్ర భక్షీ పాత్రో అని న్యాయవాది, సమాజ సేవకుడు హరిహర కరసుధా పట్నాయక్ అన్నారు. భక్షీపాత్రో 91వ జయంతోత్సవం సందర్భంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. స్థానిక కార్మిక భవనంలో ఉత్కళ సమ్మిళనీ కొరాపుట్ జిల్లా అధ్యక్షుడు మదన మోహననాయిక్ అధ్యక్షతన జరిగిన బక్షీ పాత్రో జయంతి ఉత్సవంలో పట్నాయక్ మాట్లాడుతూ.. రెవెన్షా కళాశాలలో విద్యార్థి ఉద్యమంలో పాల్గొని ఆ కళాశాల నుంచి విద్యార్థి యూనియన్ అధ్యక్షునిగా అవిభక్త కొరాపుట్ నుంచి ఎన్నికైన ప్రథమ వ్యక్తి భక్షీపాత్రో కావటం జిల్లా ప్రజలు గర్వించదగిన విషయం అన్నారు. కమ్యూనిస్టుగా తన రాజకీయ జీవితం ప్రారంభించిన భక్షీ అవిభక్త కొరాపుట్‌లో అన్ని గ్రామాల్లో పర్యటించి ఆదివాసీ, దళితుల సమస్యలు తెలుసుకొని వాటి సాధనకు పోరాటాలు జరిపిన పేదల పెన్నిధి అని కొనియాడారు. ఎమర్జన్సీ సమయంలో అరెస్టయి జైలు జీవితం గడపిన ఆయన విడుదల అయిన తరువాత ఉత్కళ కాంగ్రెస్, జనతా పార్టీ చేరినప్పటికీ ప్రజా సమస్యలపై పోరాటం చేయటంలో ఏనాడు వెనుకడుగు వేయలేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఆయన రాష్ట్ర ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. ఉత్కళ సమ్మిళనీ ఉద్యమానికి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. అవిభక్త కొరాపుట్ ఉన్నతికి, పరిశ్రమలు, విద్యాలయాల ఏర్పాటులో ఆయన పోషించిన ప్రధాన భూమిక మరువ లేనిదని ప్రశంసించారు. ముందుగా స్వర్గీయ భక్షీపాత్రో చిత్ర పటానికి పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సభలో జయపురం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్, సీనియర్ బీజేడీ నేత సూర్యనారాయణ నథ్, పరమేశ్వర పాత్రో పాల్గొన్నారు.



భక్షీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అతిథులు

అదరగొట్టిన అపరాజిత

జయపురం: జయపురం సౌరావీధికి చెందిన ఆరేళ్ల బాలిక అపరాజిత నృత్య పోటీల్లో అదరగొట్టింది. రాష్ట్ర త్రలింగ కళా నికేతన్ ఈ నెల 15 వ తేదీన పూరీలో నిర్వహించిన శ్రీకృష్ణ రాస ఉత్సవం సందర్భంగా నిర్వహించిన నృత్య పోటీల కార్యక్రమంలో అపరాజిత ఆదివాసీ వేషంలో ఆదివాసీ నృత్యం చేసి అందరి ప్రశంసలు పొందింది. ఈ సందర్భంగా ఆమె సంస్కృతి సన్మానం-2024కు ఎంపికైంది. నిర్వాహకులు బాలికను సన్మానించారు.



ఆదివాసీ బాలిక వేషంలో అపరాజిత అధికారి



సంస్కృతి సన్మానం-2025 అవార్డు

ఘనంగా హరిశ్చంద్ర భక్షిపాత్రో జయంతి



కొరాపుట్‌లో హరిశ్చంద్ర భక్షిపాత్రో విగ్రహం వద్ద ప్రముఖులు

కొరాపుట్: దివంగత మంత్రి హరిశ్చంద్ర భక్షిపాత్రో 91వ జయంతి ఘనంగా జరిగింది. ఆదివారం కొరాపుట్ జిల్లా కేంద్రంలో జాతీయ రహదారి మీద ఉన్న హరిశ్చంద్ర భక్షిపాత్రో విగ్రహానికి ప్రముఖులు నివాళులు అర్పించారు. హరిశ్చంద్ర కొరాపుట్, జయపూర్ స్థానాలకు ఎమ్మెల్యేగా సేవలు అందించారు. కార్యక్రమంలో కొరాపుట్ సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షుడు ఈశ్వర్ చంద్ర పాణిగ్రాహీ, కొరాపుట్ మున్సిపల్ చైర్మన్ లలెటెందు రంజన్ శెఠి, జయపూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మున్నా రథొ పాల్గొన్నారు.

సంతలో వస్తు విక్రయాలపై.. విద్యార్థులకు అవగాహన



సంతలో వ్యాపారం చేస్తున్న విద్యార్థుల వద్ద బట్టలు కొనుగోలు చేస్తున్న ఉపాధ్యాయిని



గాజుల వ్యాపారం చేస్తున్న విద్యార్థులు

మల్కన్‌గిరి: వ్యాపారంపై విద్యార్థులకు అవగాహన కల్పించే ప్రక్రియకు ఉపాధ్యాయులు శ్రీకారం చుట్టారు. మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి స్వభిమాన్ ఏరియా బోడపోదర్ పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో వారపు సంతలో ఎలా వ్యాపారం చేస్తారో వివరించేలా విద్యార్థులతో ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు వ్యాపారులుగా ఉపాధ్యాయులు కొనుగోలుదారులుగా వ్యవహరించారు. అచ్చం సంతలో విక్రయించేలా కూరగాయలు, బట్టలు, గాజుల దుకాణం, గిరిజన పంటలు ఇలా అనేక రకాలను విద్యార్థులు అమ్మిచూపారు. గతంలో సంతల్లో వ్యాపారులు అమాయకులైన గిరిజనులను ఎలా మోసం చేసేవారో గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ ప్రాంతం ఒకప్పుడు మావోయిస్టు ప్రభవిత ప్రాంతం. దీంతో ఇక్కడ వారు ఎక్కువగా బయటకు వెళ్లేవారు కాదు. దీంతో ఇక్కడకు వ్యాపారులు వచ్చి తక్కువ ధరకు కొనుగోలు చేసే వస్తువులు అధిక ధరలకు గిరిజనులకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. అలాంటి వ్యాపారులకు బుద్ధి చెప్పేలా పిల్లల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ముఖ్యఅతిథిగా హాజరైన సమితి అధికారి దిలీప్‌కుమార్ తెలిపారు.



కూరగాయలు విక్రయిస్తున్న విద్యార్థులు

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- చోరీసొత్తు స్వాధీనం



నిందితులను తీసుకొస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులు

కొరాపుట్: చోరీ కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌డీపీవో మధుసిక్తా మిశ్ర కేసు వివరాలు ప్రకటించారు. దసరా పాడవీధిలో ఈ నెల 12 తేదీన వివేక్ మిశ్ర ఇంట్లో దొంగలు పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేయగా వాస్తవం బయటపడింది. బాధితుని బంధువైన 14 ఏళ్ల బాలుడు దొంగతనానికి సూత్రధారిగా తేలింది. బాలుడిని అదుపులోనికి తీసుకొని విచారించగా వివరాలు బయటపడ్డాయి. భంజ్ వీధికి చెందిన టునా దాస్, శివ బారిక్ దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వీరి వద్ద రితేష్ కర్కరా, కిశోర్‌గౌడ్‌లు చోరీ వస్తువులు కొనుగోలు చేసినట్టు అంగీకరించారు. వీరి వద్ద నుంచి మూడు తులాల బంగారం, ఎనిమిది చెవి పోగులు, ఒక నెక్లస్, ఒక బ్రాస్లెట్, ఆరు బంగారు కమ్మలు, ల్యాప్ టాప్ స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వీటి విలువ సుమారు రూ. తొమ్మిది లక్షలు ఉంటుందని అంచనా. నిందితులను కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు పేర్కొన్నారు.

విద్యారంగం పటిష్టతకు చర్యలు



ఉన్నత పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గొండ

- విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండ

రాయగడ: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండ జిల్లాలోని బిసంకటక్‌లో శనివారం సాయంత్రం పర్యటించారు. సమితి పరిధిలోని పాయికొడా కులుగుడలో మనోరేగ పథకంలో భాగంగా సుమారు రూ. 90 లక్షల వ్యయంతో నిర్మించిన ఉన్నత పాఠశాల భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం కొత్త ప్రణాళికలు రూపొందిస్తోందన్నారు. నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఇదిలాఉండగా ఆదివాసీ సంక్షేమ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థులకు మరిన్ని సౌకర్యాలను కల్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్, పార్టీ సీనియర్ నాయకులు కాశీరాం మాఝి, శివశంకర్ ఉలక, బిసంకటక్ ఎమ్మెల్యే నీలమాధవ హికక, బిడిఒ సదాశివ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి గొండ పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, పథకాలు ప్రజల దరికి చేరేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు

గంజాయి రవాణాపై ఉక్కుపాదం

పర్లాకిమిడి:

గజపతి జిల్లా ఆర్.ఉదయగిరి పోలీసు స్టేషన్ పరిధిలో కంకడగుడ–తుమన్ రోడ్డుకు 500 మీటర్ల దూరంలో ఒక బొలేరో వాహనంలో గంజాయి బస్తాలు ఇతర రాష్ట్రాలకు రవాణా అవుతుండగా శనివారం సాయంత్రం పట్టుబడినట్టు ఎస్పీ జితేంద్ర నాథ్ పండా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. రాణిపేట డీపీఓ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్పీ వివరాలు వెల్లడించారు. ఆర్.ఉదయగిరి పీఎస్ పరిధిలో కంకడగుడ రోడ్డులో గంజాయి రవాణా చేస్తూ మాన్యుల్ ఆనందో(25), ఆస్మాన్ ఆనంద (22)లు దొరికిపోయారు. వారి వద్ద నుంచి రెండు బైక్‌లు, రెండు మొబైళ్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా గంజాయి రవాణా అవుతున్న బొలేరో వాహనంలో 385 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని ఆదివారం స్పెషల్ మేజిస్ట్రేట్ వద్ద హాజరు పరిచినట్టు ఎస్పీ జి.ఎస్.పండా తెలిపారు. సంఘటనా స్థలం నుండి మరో ముగ్గురు నిందితులు కన్నుగప్పి పారిపోయినట్టు చెప్పారు. నిందితులు ఇద్దరు ఆర్.ఉదయగిరి బ్లాక్ కంకడగుడ గ్రామానికి చెందిన వారని అన్నారు.



ఎస్పీ కార్యాలయంలో గంజాయి నిందితులను ప్రవేశపెట్టిన అధికారులు

250 కిలోల గంజాయి స్వాధీనం

కొరాపుట్: కొరాపుట్ జిల్లా పోలీసులు 250 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం నందపూర్ ఎస్‌డీపీఓ సంబిత్ కుమార్‌కి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మాచ్‌ఖండ్, నందపూర్ పోలీసులు సంయుక్తంగా పెట్రోలింగ్ చేశారు. నందపూర్ సమితి కార్యాలయం సమీపంలో ఒడి 10యు 5698 నంబర్ గల పికప్ వాహనంలో తనిఖీలు చేశారు. అందులో గంజాయి పట్టుబడింది. వాహన డ్రైవర్ మల్కన్‌గిరి జిల్లా ముదలి పాడ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన సనాతన పాత్రోని అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి గంజాయి, డ్రైవర్‌ని కోర్టులో హాజరు పరిచి జైలుకు తరలించారు.

14 కిలోల గంజాయి పట్టివేత

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కేంద్రానికి సమీపంలో గల గొడిగూడ పంచాయతీ కూడలి వద్ద ఆదివారం మధ్యాహ్నం ఎక్సైజ్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఓ ఆటో అతివేగంగా రావడంతో దాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో ఒక బస్తా గంజాయిని గుర్తించి వెంటనే ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేశారు. ఈ బస్తా గంజాయిను చిత్రకొండ నుంచి చత్తీస్‌గఢ్‌కు తరలిస్తుండగా పట్టుకున్నారు.



ఆర్.ఉదయగిరి కంకడగుడ వద్ద పట్టుబడిన గంజాయి బస్తాలతో పాటు నిందితులు



నందపూర్ పోలీసుల అదుపులో గంజాయి, వాహనం, డ్రైవర్



గంజాయి బస్తాతో దొరికిన నిందితులు

క్లుప్తంగా

మాంసం దుకాణాలు కిటకిట..

● ముగిసిన కార్తీకం



చేపలు, మాంసం కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న మార్కెట్

భువనేశ్వర్: స్థానికులకు పవిత్ర కార్తీక మాసం ముగిసింది. నెల రోజులపాటు చాలామంది మాంసాహారానికి దూరంగా ఉన్నారు. కార్తీకం ముగియడంతో నెల రోజులపాటు మాంసాహారం కోసం తహతహలాడిన వర్గాలు ఆదివారం ఈ మార్కెట్ల వైపు అడుగు వేయడంతో కిటకిటలాడాయి. ఇక్కడ విక్రయించే చేపలు, పీతలు, రొయ్యలు, మాంసం ధరలు చుక్కల్ని తాకాయి. రుచికరమైన మాంసాహార వంటకాలతో ఇంటింటా ఘుమఘుమలు గుప్పుమన్నాయి. ఒడియా సంప్రదాయంలో మాంసం కూర, చేపల వేపుడు, పీతల కూర, రొయ్యల ఆవ కూర (బెసారొ), కలగూర చేపల బుర్ర కూర (ముఢి ఘొంటొ) వంటకాలతో ఇంటిల్లిపాది మాంసాహార రుచులతో సంతసించారు. మాంసం, చేపలు కిలో రూ. 800 నుంచి రూ. 3,000 వరకు ధరలు పలికాయి.

ఆత్మీయ కలయిక



ఒకేచోట చేరిన పూర్వ విద్యార్థులు

పొందూరు: పొందూరు హైస్కూల్, జూనియర్ కళాశాలలో 1975–76 పదో తరగతి, 1976–78 ఇంటర్మీడియెట్ చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక పట్టుశాలి కళ్యాణ మండపంలో ఉత్సాహంగా జరిగింది. 48 ఏళ్ల తర్వాత ఒకే చోట కలిసి ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. అప్పట్లో తమకు భౌతిక శాస్త్రాన్ని బోధించిన డాక్టర్ అల్లంశెట్టి చంద్రశేఖర్‌రావు దంపతులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

బాధితులకు మాజీ మంత్రి పరామర్శ

కాశీబుగ్గ: వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో టీడీపీ నేతల దాడికి గురై పలాస ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వైఎస్సార్సీపీ వర్గీయులను మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆదివారం పరామర్శించారు. ఈ ఘర్షణలో ఇద్దరు మహిళలు, యువకుడు గాయాలపాలవడంతో రెండు రోజులుగా పలాస ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. 2023లో మంచినీళ్లపేట పర్యటనకు వచ్చిన గౌతు శిరీషను నీలమ్మ, లక్ష్మమ్మ, చిన్నారావులు నిలదీశారనే కక్షతో వారిపై కక్ష పెట్టుకుని దాడులకు తెగబడ్డారని బాధితులు తెలిపారు.

ఉపాధ్యాయులను కించపరచడం తగదు



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

టెక్కలి: అపార్ నమోదు సమస్యల విషయంలో ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ కించపరిచేలా ఆర్డీఓ వ్యాఖ్యలు చేయడం సరికాదని యూటీఎఫ్ జిల్లా, మండల ప్రతినిధులు కె.దాలయ్య, పి.గణపతిరావు, ఇతర సభ్యులు మండిపడ్డారు. ఆదివారం టెక్కలిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాల మంజూరు విషయంలో ప్రధానోపాధ్యాయులు ఇస్తున్న సర్టిఫికెట్లను ప్రామాణికంగా తీసుకోవాలని కోరారు. ఈ నెల 24 నుంచి మందసలో జరగనున్న స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని కోరారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ్ గౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ పి.అప్పారావు, ప్రతినిధులు టి.వైకుంఠరావు, పి.ధర్మారావు, డి.పాపారావు, అరుణ్‌కుమార్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, కృష్ణారావు, చిన్నవాడు తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ ఇంట్లో చోరీ

నరసన్నపేట: మండలంలోని రావాడపేట జగనన్న కాలనీలో బైక్ మెకానిక్ ముంగి శాంతారావు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. రూ.లక్షా 95 వేలు నగదు చోరీ చేశారు. ఈ మేరకు శాంతారావు నరసన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం మధ్యాహ్నం ఇంటికి భోజనానికి వెళ్లిన శాంతారావు తిరిగి నరసన్నపేట వచ్చారు. మళ్లీ రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి వెళ్లగా తాళాలు తీసి ఉండటాన్ని గుర్తించాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువా, పెట్టెలు తెరిచి ఉన్నాయి. వస్తువులు చిందరవందరగా పడేసి ఉన్నాయి. దాచుకున్న రూ.1.95 లక్షలు కనిపించలేదు. బంగారు ఆభరణాలు మాత్రం యథావిధిగా ఉన్నాయి.

దేవదేవుని భూములకు రక్షణ

భువనేశ్వర్:

పూరీ శ్రీ జగన్నాథుడు సిరి మంతుడు. ఆయన పేరిట రాష్ట్రంతో పాటు రాష్ట్రేతర ప్రాంతాల్లో సువిశాల భూములు విస్తరించి ఉన్నాయి. పలు చోట్ల స్వామి భూములు పలువురి కబ్జాలో చిక్కుకుని ఉన్నాయి. ఇటీవల కాలంలో ఈ భూముల నేపథ్యంలో ఊహాతీతమైన అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. ఈ పరిస్థితుల పట్ల రాష్ట్ర న్యాయ శాఖ ఘాటుగా స్పందించింది.

శ్రీ జగన్నాథుని భూముల్ని అక్రమార్కుల కబ్జా నుంచి తొలగించి దేవస్థానం అధీనంలోకి తేనున్నట్లు రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వీ రాజ్ హరిచందన్ తెలిపారు. అక్రమార్కులకు వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టేందుకు విభాగం సిద్ధంగా ఉందన్నారు. చట్టపరమైన చర్యలతో శ్రీ జగన్నాథ స్వామి భూముల వివాదం పరిష్కరించి వసూలైన నిధులతో భారీ కార్పస్ నిధి ఏర్పాటు చేయడం జరుగుతుందని మంత్రి వివరించారు.

ఏకీకృత విధానం

అక్రమార్కుల నుంచి స్వామి భూముల్ని స్వాధీనపరచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2003 సంవత్సరంలో ఏకీకృత విధానం ప్రవేశ పెట్టింది. ఈ విధానం కింద స్వామి భూముల ఆక్రమణ సమస్య పరిష్కారానికి అనువైన కార్యాచరణ ఖరారు అయి ఉంది. దీనిని కట్టుదిట్టంగా అమలు చేయనున్నట్లు మంత్రి వివరించారు.

వేలాది ఎకరాల భూములు

పూరీ శ్రీ జగన్నాథునికి రాష్ట్రంలోనే కాకుండా రాష్ట్రేతర ప్రాంతాల్లో కూడా భూములు విస్తరించి ఉన్నాయి. అధికారిక రికార్డుల ప్రకారం శ్రీ జగన్నాథుని పేరిట రాష్ట్రంలో 24 జిల్లాల్లో భూములు విస్తరించి ఉన్నాయి. ఈ జిల్లాల్లో సమగ్రంగా 60,426.943 ఎకరాల విస్తీర్ణపు భూములు స్వామి పేరిట నమోదై ఉన్నాయి. వీటిలో 38,061.892 ఎకరాల విస్తీర్ణపు స్థలాలపై శ్రీ జగన్నాథ ఆలయం పాలక మండలి అధికారం (ఆర్ఓఆర్) కలిగి ఉంది. రాష్ట్రేతర ప్రాంతాల్లో స్వామి పేరిట భూములు ఉన్నట్లు అధికారిక దస్తావేజులు పేర్కొంటున్నాయి. దేశంలో 6 ఇతర రాష్ట్రాల్లో శ్రీ జగన్నాథ స్వామి సమగ్రంగా 395.252 ఎకరాల విస్తీర్ణపు భూములు కలిగి ఉన్నాడు.

స్థలాల నిధులతో కార్పస్

అక్రమార్కుల అధీనంలో ఉన్న శ్రీ జగన్నాథ స్వామి భూముల్ని స్వాధీనపరచుకునే దిశలో అధికార యంత్రాంగం వ్యూహాత్మక కార్యాచరణతో నడుం బిగించింది. దారి తప్పిన భూముల్ని క్రమబద్ధీకరించే దిశలో ఆక్రమణలో ఉన్న వారికి న్యాయ సమ్మతంగా కొంత స్థలం అనుమతించి మిగిలిన స్థలం, భూమిని ప్రభుత్వ నిర్ధారిత ధరలకు విక్రయించాలని యోచిస్తోంది. ఈ కార్యాచరణతో చేకూరే ధనంతో శ్రీ జగన్నాథుని పేరిట భారీ కార్పస్ నిధి ఏర్పాటు చేసే సంకల్పంతో యంత్రాంగం కదలిక ఆరంభమైంది. ఈ సన్నాహంతో ఆక్రమణకు గురైన భూముల నుంచి సుమారు రూ. 8 వేల నుంచి 10 వేల కోట్ల వరకు ఆదాయం చేకూరుతుందని అంచనా. ఈ ఆదాయం రాష్ట్రంలో ఆక్రమణకు గురైన భూములకు మాత్రమే పరిమితం కావడం విశేషం.

దొంక కదిపిన తాజా సంఘటన

స్వామి భూములు, ఆస్తులతో అక్రమ చర్యల్ని ఏమాత్రం సహించేది లేదని శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ డాక్టరు అరవింద కుమార్ పాఢి హెచ్చరించారు. శ్రీ జగన్నాథుని భూముల సమగ్ర వివరాల్ని డిజిటలైజేషను చేయనున్నట్లు ఆయన తెలిపారు. పూరీ మర్ఫత్ శ్రీ జగన్నాథ మందిర్ పరిచాలన్ కమిటి పేరు మీద శ్రీ జగన్నాథ స్వామికి చెందిన 64.88 ఎకరాల స్థలాన్ని 109 మడులుగా (ప్లాట్లు) విభజించి విక్రయ లావాదేవీలకు పాల్పడిన సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. ఈ అక్రమ చర్య వ్యతిరేకంగా పూరీ బసేలి సాహి ఠాణాలో పోలీసులకు లిఖితపూర్వక ఫిర్యాదు అందింది. దీని ఆధారంగా కేసు నమోదు చేసి అనుబంధ దర్యాప్తు ప్రారంభించారు. గత ఏడాది సెప్టెంబరు నెలలో అప్పటి న్యాయ శాఖ మంత్రి జగన్నాథ సరకా శాసన సభలో ప్రవేశ పెట్టిన సమచారం ప్రకారం శ్రీ జగన్నాథ ఆలయ చట్టం – 1955 కింద రాష్ట్రంలో వివిధ తహసీల్ పరిధిలో శ్రీ జగన్నాథ స్వామి భూముల ఆక్రమణకు సంబంధించి 974 కేసులు నమోదై ఉన్నాయి.

బీజేపీ నాయకునిపై దాడికి యత్నం



అల్లరి మూకను అడ్డుకునే ప్రయత్నంలో పోలీసులు



ఏఎస్పీ పాత్రోను కలసి పరిస్థితిని వివరిస్తున్న బీజేపీ నాయకులు

● పోలీస్ అదుపులో ఇద్దరు నిందితులు

రాయగడ: బీజేపీ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడు బసంత కుమార్ ఉలకపై కొందరు గుర్తుతెలియని వ్యక్తులు దాడికి ప్రయత్నించారు. దాదాపు 8 మంది ఆయనపై మారణాయుధాలతో దాడికి దిగబోయారు. స్థానిక విద్యానగర్ నాల్గో లైన్‌లో గల శ్రేష్ఠ ఫౌండేషన్ అనే కార్యాలయంలో తన మిత్రులతో సమావేశమై మాట్లాడుతున్న బసంత కుమార్‌పై దాడి చేసేందుకు వెళ్లిన అల్లరిమూక ఇంటి తలుపులను విరగ్గొట్టి నానా రభస సృష్టించారు. శనివారం రాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి అదే రోజు రాత్రి బాధితుడు బసంత కుమార్ ఉలక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై బీజేపీ జిల్లా అధ్యక్షులు శివకుమార్ పట్నాయక్, ఆ పార్టీ ఎస్‌సి,ఎస్‌టీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షులు కాశీరాం మాఝి తదితరులు జిల్లా అదనపు ఎస్పీ బిష్ణు ప్రసాద్ పాత్రోను కలసి పరిస్థితిని సమీక్షించి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అసలు ఏం జరిగింది..?

శనివారం రాత్రి విద్యానగర్ నాల్గో లైన్‌లో ఇరు వర్గాలకు చెందిన కొందరు తమలో తాము కొట్టుకుంటూ ఒక వర్గానికి చెందిన ఇద్దరు విద్యానగర్‌లో గల శ్రేష్ఠ ఫౌండేషన్ అనే కార్యాలయం లోపలకు ప్రవేశించి తలుపులు మూసి వేశారు. దీంతో అక్కడకు చేరుకున్న మరో వర్గానికి చెందిన వారు తలుపులు విరగ్గొట్టి లోపలకు ప్రవేశించి అక్కడున్న వారిపై దాడి చేశారు. అదే సమయంలో బీజేపీ నాయకుడు బసంత కుమార్ ఉలక, అతని స్నేహితులు అదే కార్యాలయంలోని ఓ గదిలో ఉండగా బయట కేకలు వినిపించడంతో బయటకు వచ్చి చూశారు. దీంతో దాడి చేసేందుకు వచ్చిన అల్లరిమూకలు అక్కడి నుంచి పారిపోయాయి. వీరు తనపైనే దాడికి వచ్చారని బసంతకుమార్ ఉలక ఫిర్యాదు చేశారు.

కల్కి అవతారమంటూ బాలుడికి పూజలు



కల్కి అవతారిగా బాలుడు



బాలుని తండ్రి

భువనేశ్వర్: రాష్ట్రంలో ఓ బాలుడు కల్కి అవతారిగా పూజలు అందుకుంటున్నాడు. ఈ వైఖరి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ సంఘం (ఎస్‌సీపీసీఆర్) స్వయంగా కేసు నమోదు చేసింది. స్థానిక ఖండగిరి ప్రాంతంలో శ్రీ వైకుంఠ ధామం ప్రాంగణంలో బాలుడు కల్కి అవతారిగా పూజలు అందుకుంటున్న ప్రసారం ఆధారంగా భరత్‌పూర్ ఠాణా పోలీసులు కేసు నమోదు చేశారు.

దీంతో దుమారం తార స్థాయికి తాకింది. బాలల హక్కుల సంఘం ఈ మేరకు సమగ్ర నివేదిక దాఖలు చేయాలని భరత్‌పూర్ ఠాణా పోలీసులకు తాఖీదులు జారీ చేసింది. ఈ మేరకు 15 రోజుల గడువు మంజూరు చేసింది. బాలల సంక్షేమ కమిటి ఈ ప్రసారంపై విచారణ చేపట్టాలని ఎస్‌సీపీసీఆర్ ఆదేశించింది.

వివాదంలో చిక్కుకున్న కల్కి అవతార బాలుడు ప్రముఖ భాష్యకారుడు కాశీనాథ్ మిశ్రా కుమారుడు. సాంఘిక మాధ్యమంలో ప్రసారమైన ఫొటోలు అభూత కల్పనగా ఆయన పేర్కొన్నారు. ఈ చిత్రాలపై లోతుగా విచారణ చేపట్టి వాస్తవాస్తవాల్ని వెలుగులోకి తేవాలని ఆయన అభ్యర్థించారు.

గంజాయి మొక్కల ధ్వంసం



మొక్కలను తొలగిస్తున్న పోలీస్ సిబ్బంది



గంజాయి మొక్కలను తగలబెడుతున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గల అశరగుడి, నువాపడ పంచాయతీల్లో అక్రమంగా సాగు చేస్తున్న గంజాయి మొక్కలను పోలీసులు ధ్వంసం చేశారు. ఆదివారం ఆయా ప్రాంతాల్లో దాడులు చేశారు. 18 ఎకరాల విస్తీర్ణంలో గల 54 వేల గంజాయి మొక్కలను నరికివేసి వాటిని తగలబెట్టారు.

గంజాయి అక్రమ రవాణా, సాగుపై ఉక్కుపాదం మోపిన పోలీసులు ఈ మేరకు విస్తృత దాడులను నిర్వహిస్తున్నారు.

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ:నగరంలోని ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు పీస హర్షల్ సాయిచరణ్, హర్షిత్ రామచరణ్ జాతీయ ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి 28 వరకు నంద్యాలలోని డీఎస్ఏ స్టేడియం వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దు

కాశీబుగ్గ: విశాఖలోని స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించవద్దని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నేతృత్వంలో పలు ప్రజా సంఘాల నాయకులు నినదించారు. ఈ మేరకు ఆదివారం కాశీబుగ్గ బస్టాండ్‌లో గాంధీ విగ్రహం వద్ద కరపత్రాల ఆవిష్కరించారు. పోస్ట్‌కార్డు ఉద్యమ ఆవశ్యకతను వివరిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ నాయకుడు చౌదరి లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కితీసుకోవాలని, నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, మద్దిల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న మంత్రి గొండ, పక్కన కలెక్టర్ పట్వారీ, తదితరులు

రాయగడ:

గత రెండు రోజులుగా జిల్లాలో పర్యటించిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నిత్యానంద గొండ ఆదివారం స్థానిక డీఆర్‌డీఏ సమావేశంలో అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేలా అధికారులు చిత్తశుద్ధితో విధులను నిర్వహించాలన్నారు. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో అధికారులు పర్యటించి అక్కడ నివసిస్తున్న వారి సమస్యలను తెలుసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రజలందరికీ చేరిననాడే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధికి నోచుకుంటుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా రాష్ట్ర సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు నివేదికలు ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. మనోరేగా వంటి పథకాల్లో ప్రజలు లబ్ధి పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు లభించిన నాడే వలస బాటలు తగ్గుముఖం పడతాయన్నారు. కలెక్టర్ ఫరూల్ పట్వారీ, ఏడీఎం భాస్కర చంద్ర రైతా, సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్రాదేవి, జిల్లా పరిషత్ ముఖ్యకార్యనిర్వాహక అధికారి నిహారి రంజన్ కుహోరో తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



వ్యాన్ బోల్తా

● మహిళ మృతి, 11 మందికి గాయాలు



క్షతగాత్రులను బరంపురం మెడికల్‌కు తరలిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా బ్లాక్ కెందుఘాటి వద్ద ప్రయాణికులతో వెళ్తున్న వ్యాన్ బోల్తా పడింది. ఈ దారుణ ఘటనలో ఒక మహిళ మృతి చెందగా..11 మందికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. నయాఘడ్ జిల్లా శరణుకులో, బోడెయిపల్లి గ్రామాల నుంచి ఒకే కుటుంబానికి చెందిన 14 మంది కోరాపుట్‌కు పిక్నిక్ కోసం వ్యాన్‌లో భువనేశ్వర్ నుంచి శనివారం బయలుదేరారు. మోహానా మీదుగా వెళుతున్న వ్యాన్ కెందుఘాటి వద్ద ఆదివారం వేకువ జామున నాలుగు గంటల సమయంలో అదుపు తప్పి రెండు పల్టీలు కొట్టి బోల్తా పడింది. ఈ ఆకస్మిక సంఘటనతో నిద్రలో ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో నయాఘడ్ జిల్లా సహాలీ గ్రామానికి చెందిన సరోజినీ బెహరా (52) మృతి చెందగా.. మరో 11 మందికి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో నలుగురు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. గాయపడిన వారిలో నయాఘడ్ జిల్లా శరణకుల్లో, బోడెయిపల్లి గ్రామాలకు చెందిన ఉదయనాథ్ బెహరా (67), ఆనంద బెహరా, పద్మనాభ బెహరా, ప్రశాంత మంగువాళో, గణేశ్వర బెహరా (37), ప్రియాసింగ్ బెహరా (7), శుభాంకర్ బెహరా, శాంతిలతా బెహరా (60), ప్రయాస్ కాంత్ మంగువాళో, నిరంజన్ బెహరా ఉన్నారు. ఈ సంఘటన జరిగిన అనంతరం మోహానా అగ్నిమాపక దళం సంఘటనా స్థలాన్ని చేరుకుని క్షతగాత్రులను తొలుత మోహానా హెల్త్ సెంటర్‌కి తరలించి ప్రాథమిక చికిత్స అందజేశారు.

అనంతరం తీవ్ర గాయాలైన ముగ్గురుని బరంపురం మెడికల్‌కు తరలించినట్టు మోహానా మెడికల్ డాక్టర్ రామక్రిష్ణ పాత్రో తెలియజేశారు. మోహానా పోలీసులు కెందుఘాటి వద్దకు చేరుకుని పరిశీలించారు. మృతి చెందిన సరోజినీ బెహరా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్టు మోహానా ఐఐసీ బసంత్ కుమార్ శెఠి తెలియజేశారు. ఇదిలా ఉండా.. కెందుఘాటి వద్ద గత అక్టోబర్ 21వ తేదీ రెండు ప్రైవేటు బస్సులు, ఒక మ్యాక్స్ పికప్ వ్యాను ఢీకొన్న ఘటనలో 40 మందికి గాయాలైన ఘటన మరువకముందే ఇటువంటి ఘటన ఇక్కడ జరగడంతో ఈ ప్రాంతీయులు ఆందోళన చెందుతున్నారు. ఘాటీ వద్ద ప్రమాద సూచిక, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వణికిస్తున్న చలి

ప్రాంతం	రాత్రి పూట ఉష్ణోగ్రత (డిగ్రీల సెల్సియస్)
సిమిలిగుడ	12.1
రౌర్కెలా	13.1
ఝార్సుగుడ	13.3
చిపిలిమా	13.8
సుందర్‌గడ్	14.0
భద్రక్	14.0
కెంఝొహర్	14.6
ఢెంకనాల్	14.9

భువనేశ్వర్: రాష్ట్రంలో రాత్రి పూట ఉష్ణోగ్రత క్రమంగా దిగజారుతోంది. భారత వాతావరణ శాఖ ఐఎండీ ముందస్తు అంచనా ప్రకారం శనివారం రాత్రి నుంచి ఉష్ణోగ్రత గణనీయంగా దిగజారడంతో చలి వణికిస్తోంది. రాష్ట్ర స్థాయిలో జి.ఉదయగిరి ప్రాంతంలో అత్యల్ప ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ప్రాంతంలో అతి తక్కువగా 7.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయ్యింది. కంధమల్ జిల్లా ఫుల్బణి (11 డిగ్రీల సెల్సియస్), దారింగిబాడి (12 డిగ్రీల సెల్సియస్) ప్రాంతాల్లో చలి ప్రజల్ని వణికించింది. మరికొన్ని మారు మూల ప్రాంతాల్లో మంచు దట్టంగా కురుస్తోంది.

తగ్గనున్న ఉష్ణోగ్రత

రానున్న 3 రోజుల్లో రాత్రి పూట ఉష్ణోగ్రత మరింత తగ్గే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం తెలిపింది. సుమారు 3 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రత దిగజారుతుంది. జంట నగరాల్లో రాత్రి పూట ఉష్ణోగ్రత తగ్గింది. భువనేశ్వర్‌లో సాధారణ రాత్రి పూట ఉష్ణోగ్రత కంటే 3 డిగ్రీల సెల్సియస్, కటక్ మహా నగరంలో 1.4 డిగ్రీల సెల్సియస్ తగ్గుముఖం పట్టింది. పలు ఇతర ప్రాంతాల్లో నమోదైన రాత్రి పూట ఉష్ణోగ్రతలు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



సైకిల్ రేస్‌లో పాల్గొన్న విద్యార్థులు

జయపురం: ప్రాచీన సంప్రదాయం, కళలు, క్రీడలు పరిరక్షణే ప్రధాన లక్ష్యంతో జయపురం తరుణ ప్రజ్ఞా భారతి ప్రతీ సంవత్సరం వివిధ పోటీలు నిర్వహిస్తుంది. ఈ ఏడాది కూడా గత మూడు వారాలుగా వివిధ పోటీలు నిర్వహిస్తున్న విషయం విదితమే. పోటీల్లో భాగంగా ఆదివారం స్థానిక నారాయణి ఆంగ్ల పాఠశాల క్రీడా మైదానంలో పరుగు పందాలు, సైకిల్ రేస్, మొదలగు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలల, కళాశాలల విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. తరుణ ప్రజ్ఞాభారతి అధ్యక్షుడు తపన కుమార్ త్రిపాఠీ, ఉపాధ్యక్షుడు రామశంకర షాడంగి, సహాయ కార్యదర్శి అజయ్ కుమార్ మల్లిక్, కోశాధికారి రవీంధ్ర మహారాణలతోపాటు సబిత త్రిపాఠీ, లిపిక దొలాయి పోటీలను నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా నిరంజన్ పాణిగ్రాహి, జానకీ పాణిగ్రాహి వ్యవహరించారు. తరుణ ప్రజ్ఞా భారతి వార్షికోత్సవాల సందర్భంగా పోటీలలో భాగంగా ఈ నెల 23వ తేదీ శనివారం ఒడిస్సీ, ముగ్గుల పోటీలు పంచాస మందిర ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తపన్ కుమార్ త్రిపాఠీ తెలిపారు. 24వ తేదీన చిన్నారుల పాటలు, ఆదివాసీ సంగీత పోటీలు, భక్తి పాటల పోటీలు నారాయణి ఆంగ్ల పాఠశాల మైదానంలో నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ పోటీలలో విజేతలకు తరుణ ప్రజ్ఞా భారతి వార్షికోత్సవాల ముగింపు రోజున బహుమతులు అందజేస్తామన్నారు.

ఘనంగా అంగన్‌వాడీల సమ్మేళనం



బీఎంఎస్ సమ్మేళనంలో అతిథులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా బ్లాక్ కల్యాణ మండపంలో భారతీయ మజ్దూర్ సంఘ్ సమ్మేళనం ఆదివారం జరిగింది. ఆలిండియా అంగన్‌వాడీ, లేడీస్ వర్కర్స్ యూనియన్, బీఎంఎస్ జిల్లా కార్యదర్శి అంజనీ నాయక్ నేతృత్వంలో వందలాది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు. తొలుత హైస్కూల్ జంక్షన్ నుంచి కల్యాణ మండపం వరకూ శోభాయాత్ర జరిపారు. మోహానా బ్లాక్ స్థాయిలో బీఎంఎస్‌ను బలోపేతం చేయాలని ముఖ్యవక్తగా పాల్గొన్న భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్రకార్యవర్గ సభ్యులు డాక్టర్ భవానీ శంకర్ దాస్ అన్నారు. సీనియర్ న్యాయవాది బిశ్వరంజన్ దాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని అంగన్‌వాడీ వర్కర్లుగా పనిచేస్తూ మృతి చెందిన సుమతి మల్లిక్ కుటుంబానికి రూ.50 వేలు, రిటైర్డు అంగన్‌వాడీ వర్కర్లు కె.వి.లక్ష్మీపట్నాయక్, సరస్వతీ గౌడో, మీరానాయక్‌కు లక్ష రూపాయల చొప్పున చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. సమ్మేళనంలో అంగన్‌వాడీ కర్మచారి సంఘ్ జిల్లా అధ్యక్షురాలు కాన్నిజన్నీ, మోహానా బ్లాక్ సభా నేత్రి భారతీనాయక్, రాయగఢ బ్లాక్ నుంచి ప్రమిలా దేవి, గుమ్మా నుంచి ప్రమోదినీ శోబోరోలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, భారతీయ మజ్దూర్ సంఘ్ సెక్టార్ కమిటీలను ఏర్పాటు చేశారు.

ఇచ్ఛాపురం.. ఇచ్చట పనిచేయలేం!

● బదిలీపై వెళ్లిపోతున్న అధికారులు
● కూటమి నేతల ఆధిపత్య పోరే కారణం
● ఎంపీడీఓ, డీఈ, ఏపీఎం, కార్యదర్శుల పోస్టులు ఖాళీ

ఇచ్ఛాపురం రూరల్: జిల్లా శివారు మండలమైన ఇచ్ఛాపురంలో పని చేసేందుకు అధికారులు వెనుకడుగు వేస్తున్నారు. ఇక్కడ పనిచేయడం కత్తిమీద సాములా మారిందని భయపడుతున్నారు. ధైర్యం చేసి వచ్చిన అధికారులు కూడా నెల తిరిగే లోపే ఏదో ఒక వంకతో ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. ఎన్నికల విధుల నిర్వర్తించడానికి వచ్చిన ఎంపీడీఓ వై.వి.ప్రసాదరావు ఎన్నికల తర్వాత కోరుకున్న ప్రాంతానికి బదిలీ చేయించుకున్నారు. తర్వాత వచ్చిన ఎంపీడీఓ ఎం.ఈశ్వరరావు తొలుత కొనసాగుదామనే వచ్చారు. అయితే స్థానిక కూటమి నేతల ఒత్తిడి తట్టుకోలేక వారం రోజుల్లోనే రణస్థలం మండలానికి వెళ్లిపోయారు. దీంతో నెల రోజుల నుంచి ఎంపీడీఓ పోస్టు ఖాళీగా ఉంది.

- ఈఓపీఆర్‌డీగా పనిచేసిన సత్యనారాయణ వారం కిందట అరకు వెళ్లిపోయారు. 20 రోజుల క్రితం సెర్ప్ ఏపీఎంగా విధులు నిర్వహించిన సనపల ప్రసాదరావు కంచిలి మండలానికి వెళ్లిపోగా, ఇంత వరకు ఆ పోస్టులో చేర్పించేందుకు డీఆర్‌డీఏ అధికారులు ఎంత ప్రయత్నం చేసినా.. ఇచ్ఛాపురం వచ్చేందుకు ఏపీఎంలు విముఖత చూపిస్తుండటంతో ప్రస్తుతం ఆ పోస్టు ఖాళీగానే ఉంది.
- ఇచ్ఛాపురం, కవిటి మండలాలకు సంబంధించి పంచాయతీరాజ్ డీఈగా పనిచేస్తున్న ఏ.సూర్యప్రకాశరావు మూడు నెలలు క్రితం టెక్కలి ఈఈగా డిప్యూటేషన్‌పై వెళ్లిపోవడంతో కాంట్రాక్టర్లు బిల్లుల కోసం నిత్యం టెక్కలి పరుగులు తీస్తున్నారు.
- గృహనిర్మాణ శాఖలో కొంత కాలంగా డీఈ పోస్టు ఖాళీగా ఉండగా, ఇక్కడికి వచ్చేందుకు అధికారులు నిరాకరిస్తున్నారు. ఇదే శాఖలో జేఈగా పనిచేసిన దిలీప్‌రెడ్డి కంచిలి మండలానికి బదిలీపై వెళ్లిపోగా, ఈ పోస్టులో చేరేందుకు సంబంధిత శాఖకు చెందిన ఉద్యోగులు ఇష్టపడక పోవడంతో కేశుపురం గ్రామ సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న విశ్వనాథంను ఇన్‌చార్జి ఏఈగా నియమించే ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు.
- టి.బరంపురం, మఖండపల్లి, తేలుకుంచి, హరిపురం, కేశుపురం, ఈదుపురం, తులసిగాం, కొఠారీ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు బదిలీపై వెళ్లి పోవడంతో ఆ స్థానాల్లో చేరేందుకు ఇతర పంచాయతీ కార్యదర్శులు జంకుతున్నారు.
- వీఆర్వోలది కూడా అదే పరిస్థితి. మండలం, పంచాయతీల్లో ప్రతిపక్షం పార్టీకి చెందిన ఎంపీపీ, జెట్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉండటంతో జీర్ణించుకోలేని కూటమి నేతలు తాము చెప్పినట్లే జరగాలంటూ సంబంధిత అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. అర్హులైన వారికి సైతం పింఛన్లు తొలగించాలని, గ్రామ స్థాయిలో పనులు జరగాలంటే తాము చెప్పినట్లే జరగాలంటూ ఆదేశాలు జారీ చేస్తుండటం, స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్‌చే సంబంధిత అధికారులకు హెచ్చరికలు జారీ చేస్తుండటంతో ఇక్కడ పనిచేసేందుకు ఇష్టం లేదని అధికారులు బహిరంగంగా విమర్శిస్తున్నారు.

క్లుప్తంగా

పూరిల్లు దగ్ధం



మంటలు అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జామి: మండలంలోని రామయ్యపాలెం పంచాయతీ గదబపాలెం గ్రామంలో పూరిల్లు దగ్ధమైంది. దీనిపై స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఈదుబిల్లి బోడయ్య పూరింట్లో విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఆదివారం దగ్ధమైంది. దీంతో కొత్తవలస అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు. అయితే పూరిల్లు మొత్తం అప్పటికే పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష ఆస్తి నష్టం సంభవించింది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టంజరగలేదు.

కారును ఢీకొన్న ఆటో: మహిళ మృతి



ప్రమాదంలో మృతి చెందిన తోట లక్ష్మి (ఫైల్)

భోగాపురం: ముందువెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేయబోయిన ఆటో ఆ కారును ఢీకొని బోల్తాపడడంతో జరిగిన ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. ఆదివారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. విశాఖపట్నం జిల్లా అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన తోట లక్ష్మి..భర్త, కుటుంబ సభ్యుల(8మంది)తో కలిసి వారి బంధువుల ఇంట్లో జరగనున్న బారసాల కార్యక్రమానికి ఆదివారం ఉదయం ఆటోలో విజయనగరం జిల్లా గరివిడి బయలుదేరారు. మార్గమధ్యంలో అవనాం వద్దకు చేరుకునేసరికి ముందు వెళ్తున్న కారును ఓవర్‌టేక్ చేస్తున్న క్రమంలో ఆటో అదుపుతప్పి కారును బలంగా ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తోట లక్ష్మి(45) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. మిగిలిన వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. స్థానికుల ద్వారా ప్రమాద సమాచారం అందుకున్న పోలీసులు, హైవే సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్రగాయాపాలైన వారిని విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని బంధువు తోట కనకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



విజయనగరం క్రైమ్: విజయనగరం-గొట్లాం రైల్వేస్టేషన్‌ల మధ్యలో ద్వారపూడి గ్రామం సమీపంలో రైల్వేట్రాక్‌పై సుమారు 20 నుంచి 25 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు ఆదివారం తెలిపారు. మృతుడు శరీరంపై గ్రే కలర్ టీషర్ట్, బ్లూకలర్ షార్ట్ ధరించి ఉన్నాడని చెప్పారు. రైల్వే అధికారులిచ్చిన సమాచారంతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని, ఎవరైనా గుర్తుపడితే వెంటనే ఫోన్ 9490617089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

14 మద్యం సీసాలతో నిందితురాలి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో సిబ్బంది

సీతానగరం: సీతానగరం పరిధి ఎస్‌ఎస్ పురంలో మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసి 14 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిర్వాహకురాలైన మహిళను అరెస్ట్ చేసినట్లు సీఐ డి.పద్మావతి ఆదివారం తెలిపారు. ఈ మేరకు సర్కిల్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో అక్రమంగా మద్యం విక్రయించినా, బెల్ట్‌షాపులు నిర్వహించినా, ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయాలు చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్లు తెలిసినా తక్షణమే సిబ్బందితో సోదాలు చేయనున్నట్లు స్పష్టం చేశారు. అలాగే బలిజిపేట, గరుగుబిల్లి మండలాల్లో కూడా సిబ్బంది చేపట్టనున్నట్లు తెలిపారు.

నేత్ర వైద్యశిబిరం

మెరకముడిదాం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) విశాఖపట్నానికి చెందిన నవ జీవన్, స్పందన స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో ఆదివారం నేత్ర వైద్యశిబిరం నిర్వ హించారు. శిబిరంలో విశాఖపట్నానికి చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్ రుత్తల సురేష్ 116 మందికి నేత్ర పరీక్షలు చేశారు. వీరిలో 61మందిని కంటి ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. వీరికి త్వరలో ఉచితంగా తమ ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించ నున్నామని శంకర్ ఫౌండేషన్ ప్రతినిధి సీహెచ్.వెంకటరమణ తెలిపారు. పీహెచ్‌సీ సీహెచ్‌ఓ రామారావు, స్పందన సంస్థ అధ్యక్షుడు వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



గిరిజన గ్రామంలో ఆరబెడుతున్న అపరాలు



గిరిజనులు సాగుచేస్తున్న నువ్వు పంట

- సహజ సిద్ధంగా సాగు
- గిరిజనుల ఉత్పత్తులపై మైదాన ప్రజల ఆసక్తి

కొండపై పంటలకు గిరాకీ

బొబ్బిలి రూరల్: నలుదిక్కులా పచ్చని కొండలు, మధ్యలో చిన్నచిన్న వాగులు, ఆ మధ్యలో గిరిజనులు పండించే పంటలు ఆరబెట్టిన దృశ్యం ఎంతో ఆహ్లాదకర వాతావరణాన్ని కలిగిస్తుంది. కూరగాయలు పెద్దఎత్తున సాగుచేస్తూ వాటితో పాటు పశుసంపదను గిరిజనులు అభివృద్ధి చేసుకుంటున్నారు. మండల పరిధిలోని పలు గిరిజన గ్రామాల్లో పండిస్తున్న వాణిజ్యపంటలకు చాలా గిరాకీ ఏర్పడింది. పండిన ఉత్పత్తులు నాణ్యమైనవి కావడం, రసాయానాల వినియోగం లేనివి కావడంతో ఈ పంటలను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపిస్తున్నారు. చూడముచ్చటగా కనిపించే పచ్చని కొండల్లో పండించే ఈ ఉత్పత్తులకు కొనుగోలుదారులు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారు. పట్టణం ప్రాంతాల ప్రజలు కొంతమంది గిరిజనులు పండించే ప్రాంతాలకు వెళ్లి అక్కడి వాతావరణాన్ని ఆస్వాదిస్తూ కోరుకున్న పంట ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. రాగులు, మొక్కజొన్నలు, సిరిధాన్యాలు, పెసలు, మినుములు తదితర రకాలైన పంటలను గిరిపుత్రులు సాగుచేస్తున్నారు. గిరిజనుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి పట్టణంలో ఎక్కువ ధరలకు అమ్మే వ్యాపారులు కూడా గిరిజనుల చెంతకు వాలిపోతున్నారు. వారికి కావాల్సిన పంటలను సాగుచేయాలని ముందుగానే అడ్వాన్స్‌లు ఇచ్చి మరీ పండించుకుంటున్నారు. అలాగే సీజన్‌లలో పండే పంటలకు మంచి డిమాండ్ ఉంది. ప్రస్తుతం బొబ్బిలి మండలంలోని రాచేరువలస, బట్టివలస, మోసూరువలస, నిమ్మలపాడు తదితర గిరిజన గ్రామాల్లో దొరుకుతున్న పంటలకు మంచి ధర పలుకుతుండడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గిరిజనుల పశుసంపద



ఇళ్ల మధ్య ఆరబెట్టిన రాగులు



కొండల్లో పండించిన మొక్కజొన్న

ఇదే సార్ మా బ్రాండు..!

- బయటపడిన ఘరానా మోసం
- బ్రాండెడ్ కవర్లలో కల్తీ బియ్యం
- పీడబ్ల్యూ మార్కెట్‌లో కోట్లలో వ్యాపారం

విజయనగరం క్రైమ్: ఎన్నో వ్యయప్రయాసల కోర్చి ప్రజల అభీష్టాలకనుగుణంగా బియ్యాన్ని నాణ్యమైన ప్యాకింగ్ చేసి అమ్మకాలు చేసే లలిత, అక్షయ, సమీరా తదితర బ్రాండ్‌ల బియ్యం ప్యాకెట్లను ప్రజలు కొనుగోలు చేస్తుంటారు. అటువంటి బ్రాండెడ్ రైస్‌ను ఇంటికి తీసుకువచ్చిన తర్వాత అన్నం ముద్దయిపోవడం, సరిగ్గా ఉడకకపోవడం వంటివి జరుగుతుండడంతో వినియోగదారులు ప్యాకింగ్‌లు ఓపెన్ చేసేసి, తిరిగి వాటిని ఇవ్వలేక తప్పనిసరి పరిస్థితుల్లో తినాల్సిన పరిస్థితి దాపురించింది. ఈ పరిస్థితులను పసిగట్టిన సంబంధిత బ్రాండెడ్ సంస్థల ప్రతినిధులు ఏం జరుగుతుందోనని అనుమానంతో నిఘా పెట్టి అసలు విషయం గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు చేపట్టిన దర్యాప్తులో కల్తీబియ్యాన్ని బ్రాండెడ్ కవర్లలో నింపుతున్నారన్న విషయాన్ని గుర్తించారు. రవాణాకు సిద్ధంగా ఉన్న రైస్‌బ్యాగ్‌లను పట్టుకుని సీజ్ చేశారు. ఈ మేరకు ఈ వ్యవహారంపై వన్‌టౌన్ ఎస్సై నరేష్ ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

హైదరాబాద్‌లో బ్రాండెడ్ కవర్ల తయారీ

గంటస్తంభం దగ్గర గల పీడబ్ల్యూ మార్కెట్ బియ్యం అమ్మకాలకు ప్రసిద్ధి. ఇక్కడ దొరకని బ్రాండ్ అంటూ ఉండదంటే అతిశయోక్తి లేదు. నిత్యం కోట్లలో వ్యాపారం జరుగుతూ ఉంటుంది. పీడబ్ల్యూ మార్కెట్‌లో శ్రీ జయలక్ష్మి ట్రేడర్స్ పేరుతో పెంటపాటి ఈశ్వర వెంకటరెడ్డి అలియాస్ రాజా హైదరాబాద్‌లో పద్మావతీ పాలీశాక్స్ అనే సంస్థను నడుపుతున్న శ్రీనివాసరావు దగ్గర నుంచి లలితా, అక్షయ, సమీర తదితర బ్రాండ్‌లను పోలి ఉన్న ఖాళీ బ్యాగ్‌లను జిల్లా కేంద్రానికి తెప్పించి, అందులో తక్కువ క్వాలిటీ రైస్‌ను నింపి కొనుగోలుదారులకు కనీసం అనుమానం రాకుండా మోసం చేస్తున్నాడు. వినియోగదారులు ఎవరూ చూసినా అవి బ్రాండెడ్ అనుకునేరీతిలో తక్కువ క్వాలిటీ రైస్ అమ్మకాలు చేస్తున్నాడు. ఈ విషయం పసిగట్టిన ఆ బ్రాండెడ్ కంపెనీల ప్రతినిధులు నిఘా పెట్టడంతో అసలు గుట్టు బయటకువచ్చింది. శ్రీ లలితా రైస్ సేల్స్‌మెన్ భగవాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన వన్‌టౌన్ ఎస్సై నరేష్, సిబ్బందితో కలిసి దాడి చేసి మొత్తం 641 రైస్‌బ్యాగ్‌లు 16, 666 కిలోల రైస్‌ను సీజ్ చేశారు. విచారణ నిమిత్తం జిల్లా రైస్ మార్కెటింగ్ మేనేజరుకు బియ్యం అప్పగించామని, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.



స్వాధీనం చేసుకున్న బ్రాండెడ్ ప్యాకెట్ కవర్లలో కల్తీరైస్‌ను చూపిస్తున్న వన్‌టౌన్ ఎస్సై నరేష్

'ముత్యాల వాన' పుస్తకావిష్కరణ



ముత్యాలవాన పుస్తకావిష్కరణ చేస్తున్న కవులు, సాహితీవేత్తలు

విజయనగరం టౌన్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సాహితీ స్రవంతి, సరోజినీ మహిళా మండలి ఆధ్వర్యంలో కవిగాయక సమ్మేళనం, రావిపల్లి వాసుదేవరావు రచించిన 'ముత్యాలవాన' పుస్తకావిష్కరణ ఆదివారం సాయంత్రం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ఔత్సాహిక కవులు ఇజ్రాయిల్ దురాగతంపై , మహిళల పట్ల జరుగుతున్న అకృత్యాలపై ఈ సందర్భంగా వారి గళం వినిపించారు. కవి పాయల మురళీకృష్ణ రచించిన ముత్యాలవాన పుస్తకాన్ని సభకు పరిచయం చేశారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి ప్రతినిధులు చీకటి దివాకర్, చంద్రికారాణి, శ్రీనివాసరావు, మురళి, కవులు దోసపాటి రామచంద్రరావు, మానాపురం రాజా చంద్రశేఖర్, బద్రికూర్మారావు, కొంకేపూడి అనూరాధ, జయపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాల్సిందే...



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(1104) ప్రధాన కార్యదర్శి గోపాలరావు

డెంకాడ: విద్యుత్ ఉద్యోగులకు పాత పింఛన్ విధానంలో పింఛన్‌ను చెల్లించాలని రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(1104) ప్రధాన కార్యదర్శి ఎంపీ గోపాలరావు అన్నారు. మండలంలోని గంట్లాంలో విద్యుత్ ఉద్యోగుల సంఘం (1104) యూనియన్ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల ఆత్మీయ కలయిక సమావేశం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కోసం 1104 యూనియన్ నిరంతరం పని చేస్తుందన్నారు. గ్రేడ్-2 జేఎల్‌ఎంలను రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా మార్పు చేసి సౌకర్యాలు కల్పించాలన్నారు. విద్యుత్ ఉద్యోగులందరికీ వైద్య సౌకర్యం కల్పించాలన్నారు. 2022 వేతన సవరణ బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తా..

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని విశిష్ట అతిథిగా విచ్చేసిన ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ ముువ్వల లక్ష్మణరావు అన్నారు. ఉద్యోగులు సంస్థకు మంచి పేరు తెచ్చే విధంగా పని చేయాలన్నారు. అతిథులను సన్మానించారు. కార్యక్రమంలో ఈఈ పెద్దింటి త్రినాధరావు, ఎస్‌పి వి.రాంబాబు, సంఘం డివిజనల్ అధ్యక్ష, కార్యదర్శులు వంగపండు లక్ష్మణ, సురగాల లక్ష్మణ, ఏడీఈలు కేవీఎస్‌పీ కుమార్, అంకెన కిరణ్‌కుమార్, ఎల్.సత్యనారాయణ, ఫణీంద్రకుమార్, పి.రాజ్‌కుమార్, సంఘం మాజీ అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్ఎస్ వరప్రసాద్, డి.రాజేంద్రప్రసాద్, వందలాది మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

ముగిసిన సీపీఎం జిల్లా మహాసభలు




నూతనంగా ఎన్నికైన సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు

- జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ
- 14 మందితో జిల్లా కమిటీ ఎన్నిక

విజయనగరం ఫూల్‌బాగ్: విజయనగరం జిల్లా సీపీఎం కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణ ఎన్నికయ్యారు. నగరంలోని ఏచూరినగర్‌లో గల బుద్ధదేవ్ భట్టాచార్య, రుద్రరాజు సత్యనారాయణ ప్రాంగణంలో రెండురోజులుగా జరుగుతున్న సీపీఎం జిల్లా మహాసభలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు జరిగిన ప్రతినిధుల సభలో 14 మందితో ఏర్పాటైన నూతన జిల్లా కమిటీలో జిల్లా కార్యదర్శిగా తమ్మినేని సూర్యనారాయణను మళ్లీ మహాసభ ఎన్నుకుంది. కార్యదర్శివర్గ సభ్యులుగా రెడ్డి శంకర్రావు, టీవీ రమణ, పి.శంకర్రావు, వి.లక్ష్మి ఎన్నిక కాగా, జిల్లా కమిటీ సభ్యులుగా ఎ.జగన్‌మోహన్‌రావు, జి.శ్రీనివాస్, గాడి అప్పారావు, పి.రమణమ్మ, కె.సురేష్, సీహెచ్ వెంకటేష్, వీఆర్ గోపాల్, బి రాంబాబు ఎన్నికయ్యారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు వై.వెంకటేశ్వరరావు, లోకనాథం, రాష్ట్ర కమిటీ సభ్యుడు సూర్యారావు పాల్గొన్నారు.

12 కేసుల్లో నిందితుడిపై పీడీయాక్ట్

- ఎస్పీ వకుల్ జిందాల్



విజయనగరం క్రైమ్: గడిచిన మూడేళ్లలో 12 కేసుల్లో నిందితుడిగా అరెస్ట్ అయిన 22 ఏళ్ల బండి రాజీవ్ అలియాస్ డాడీపై కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ఎస్పీ వకుల్ జిందాల్ పీడీయాక్ట్ అమలుచేశారు. ఈ విషయాన్ని ఆదివారం ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. చట్టాన్ని తరచూ ఉల్లంఘిస్తూ, ప్రజాశాంతికి భంగం కలిగిస్తూ, సమాజానికి ప్రమాదకరంగా మారుతూ, భౌతిక దాడులకు పాలపడుతూ, పలు కేసుల్లో నిందితుడిగా అరెస్ట్ అయిన పట్టణశివారు ఫూల్‌బాగ్ కాలనీకి చెందిన బండి రాజీవ్ అలియాస్ డాడీ అనే 22 ఏళ్ల వ్యక్తిపై పీడీయాక్ట్ ప్రయోగించి ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా నిర్బంధించి, విశాఖ కేంద్ర కారాగారానికి తరలించామని ఎస్పీ తెలిపారు. చెడువ్యసనాలకు అలవాటు పడి, ప్రజల పట్ల అహంకారంతో దురుసుగా ప్రవర్తిస్తూ, ఇతరులకు హానికలిగించే విధంగా చిన్న చిన్న విషయాలకే గొడవలు పడుతూ, భౌతిక దాడులకు పాల్పడుతూ, గత మూడేళ్లలో విజయనగరం వన్‌టౌన్, టూటౌన్, రూరల్ పోలీసు స్టేషన్‌ల పరిధిలో 12 కేసుల్లో నిందితుడిగా అరెస్ట్ అయ్యాడని వివరించారు. నేరాల నియంత్రణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న ముందస్తు చర్యల్లో భాగంగా పీడీయాక్ట్‌ను అమలుచేయాలని కోరుతూ టూటౌన్ పోలీసులు జిల్లా పోలీసు కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. వాటిని సిఫార్స్ చేస్తూ కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. వివిధ క్రిమినల్ కేసుల్లో అరెస్టు చేసిన నిందితులపై నిరంతరం నిఘా ఉంటుందని, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కఠినచర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో నిండుకున్న మందులు

- ప్రైవేట్ షాపుల్లో కొని తేవాలని వైద్యసిబ్బంది సూచన
- తప్పనిసరి పరిస్థితిల్లో కొని తెచ్చుకుటున్న బాధితులు



ప్రైవేట్ మందుల షాపు నించి తెచ్చిన సిరింజిలతో కుక్క కాటుకు గురైన బాధితుడికి వైద్యం చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కొత్తవలస: ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు నిండుకున్నాయి. గడిచిన ఐదునెలలుగా పూర్తిస్థాయిలో మందుల సరఫరా లేకపోవడంతో ప్రైవేట్ దుకాణాల్లో బాధితులు కొనుక్కోవాల్సిన దుస్థితి దాపురించింది. ఈ విషయం ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. కొత్తవలస మండలంలోని వియ్యంపేట పీహెచ్‌సీలో పూర్తిస్థాయిలో మందులు లేవు. దీంతో సమీపంలో గల మందుల షాపులో బాధితులు మందులు కొనుక్కుంటున్నారు. ఈ క్రమంలో మండలంలోని కర్రిచిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన లెంక హిమశ్రీ, ముసిరాం గ్రామానికి చెందిన చింతల చింతాలయ్యలు ఆదివారం కుక్కకాటు బారిన పడ్డారు. దీంతో బాధితులను బంధువులు వియ్యంపేట పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వెంటనే అక్కడి సిబ్బంది బాధితులకు ఇన్సులిన్ ఇంజెక్షన్ చేయాలని, అందుకు అవసరమైన సిరంజిలు తీసుకురావాలని బాధితుల కుటుంబసభ్యులకు తెలిపారు. వారు వెంటనే సమీపంలో గల ప్రైవేట్ మందుల దుకాణానికి వెళ్లి సిరింజీలు తెచ్చుకోగా వైద్యసిబ్బంది బాధితులకు ఇంజక్షన్‌లు చేశారు. ఈ విషయమై వైద్యసిబ్బందిని వివరణ కోరగా గడిచిన ఐదు నెలలుగా ఇన్సులిన్ సిరింజిలతో పాటు మరికొన్ని మందులు రావడంలేదని, మా దగ్గర లేనందున ప్రైవేట్ దుకాణాల్లో తెచ్చుకోవాలని సూచిస్తున్నామన్నారు. ప్రభుత్వం సరఫరా చేయకపోతే తామేం ఏంచేయాలని బదులిచ్చారు.



ప్రైవేట్ మెడికల్ స్టోర్ నుంచి తెచ్చిన సిరింజిలను చూపిస్తున్న లెంక హిమశ్రీ నాయనమ్మ వరహాలమ్మ

నిర్బంధ అరెస్టును ఖండించిన వీఆర్‌ఏల సంఘం

వేపాడ: నిబంధనలకు విరుద్ధంగా అదనపు విధులు నిర్వహించలేమని తమ సమస్యలు చెప్పుకునేందుకు చలో సీసీఎల్‌ఏ కార్యక్రమం చేపడితే ప్రభుత్వం నిర్బంధంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టు వెంకన్న అన్నారు. ఈ నెల 18న నిర్వహించే చలో సీసీఎల్‌ఏ రాయబారం కార్యక్రమానికి వెళ్లకుండా వల్లంపూడి పోలీసులు ఆదివారం తనను అరెస్టు చేయడం దారుణమని వాపోయారు. వీఆర్‌ఏలకు అదనంగా అప్పగిస్తున్న ఇసుక ర్యాంపులు, రైస్‌మిల్లుల డ్యూటీలు రద్దుచేయాలని, తెలంగాణలో అమలయ్యే విధంగా పేస్కేల్ వర్తింపచేయాలని, అటెండర్, వాచ్‌మెన్, రికార్డు అసిస్టెంట్, తదితర పోస్టుల్లో అర్హులైన వీఆర్‌ఏలను నియమించాలని తదితర డిమాండ్‌లతో 18న శాంతియుతంగా మంగళగిరి సీసీఎల్‌ఏతో సామూహిక రాయబారం కార్యక్రమం నిర్వహించ తలపెట్టామన్నారు. ఈ కార్యక్రమానికి వెళ్లకుండా శుక్రవారం సాయంత్రం నుంచి బెదిరింపులు ప్రారంభించి ఆదివారం నిర్బంధంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా రాష్ట్ర సంఘం తరపున ఖండిస్తున్నామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని గడిచిన మూడునెలలుగా సీఎం, రాష్ట్ర రెవెన్యూ మంత్రి, రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి, భూపరిపాలన ముఖ్యకార్యదర్శలను పలుమార్లు కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరామన్నారు. శాంతియుతంగా చేపట్టిన రాయబారి కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు నిర్బంధ అరెస్టుచేయడాన్ని ఖండిస్తున్నామని స్పష్టం చేశారు.



వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకన్నను అరెస్టు చేసి వల్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించిన దృశ్యం

వెనుకబడిన విద్యార్థులకు తొలి ప్రాధాన్యం



మాట్లాడుతున్న డీఈఓ యు.మాణిక్యం నాయుడు

- డీఈఓ యు.మాణిక్యం నాయుడు

విజయనగరం అర్బన్: తరగతి గదిలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి తొలి ప్రాధాన్యం ఇచ్చి బోధనా విధానాన్ని రూపొందించుకోవాలని డీఈఓ యూ.మాణిక్యం నాయుడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం జిల్లా కమిటీ స్థానిక కస్పా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో 'పదో తరగతి గణిత పబ్లిక్ పరీక్ష బ్లూ ప్రింట్‌పై ఆదివారం నిర్వహించిన మోడల్ పేపర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపి బోధనా కృత్యాలు తయారు చేయాలని చెప్పారు. అనంతరం మోడల్ బ్లూ ప్రింట్ రూపకలనపై పదోతరగతి గణిత పాఠ్యపుస్తక రచయిత జీవీబీఎస్ఎన్‌రాజు శిక్షణ ఇచ్చారు. ఫోరం రాష్ట్ర సలహాదారు సిద్ధాంతం త్రినాథరావు మాట్లాడుతూ కాస్ట్ టీఎల్ఎం, కలర్ పేపర్స్‌తో మ్యాథ్స్ టీఎల్ఎం ఎలా తయారు చేయాలో చేసి చూపించారు. వచ్చేనెలలో జరగబోయే జాతీయ గణిత దినోత్సవం ఎలా నిర్వహించాలనే విషయాలపై సమీక్షించారు. అనంతరం ఫోరం సభ్యులు డీఈఓను ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఇన్నర్ వీల్ క్లబ్ మాథ్స్‌లో ఎక్కువ సేవలు అందిస్తున్న బెస్ట్ టీచర్ అవార్డుల కింద మాథ్స్ టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా అధ్యక్షుడు వాక చిన్నంనాయుడు, పధాన కార్యదర్శి కృష్ణంరాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, 70 మంది గణిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాలిబూడిదైన పెంకుటిల్లు




కాలిపోయిన పెంకుటిల్లు, 500నోట్ల కట్టలు

- విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం
- కాలిపోయిన రూ.3.5 లక్షల నగదు, ఆరుతులాలు బంగారం



రోదిస్తున్న బాధితురాలు

మక్కువ: మండలకేంద్రం మక్కువలోని మజ్జివీధిలో ఆదివారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన ప్రమాదంలో గ్రామానికి చెందిన కొవ్వాడ వెంకటరమణ పెంకుటిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వెంకటరమణ దంపతులు ఆదివారం ఉదయం ఇంటికి తాళం వేసి, పొలంపనుల నిమిత్తం బయటకు వెళ్లారు. వెంకటరమణ ఇంటినుంచి పెద్ద ఎత్తున పొగరావడాన్ని స్థానికులు గమనించారు. ఇంటిలోని ఫ్రిడ్జి కంప్రెషర్ పేలి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంకటరమణ దంపతులు పొలం నుంచి రోదిస్తూ, ఇంటికి చేరుకునేలోగా ఇంట్లో ఉన్న 3.5 లక్షల నగదు, ఆరుతులాల బంగారం, సర్టిఫికెట్లు, బాండ్లు, తిండిగింజలు, ఫర్నిచర్ కాలిపోయాయి. స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేసినప్పటికీ, ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది చేరుకునేలోపు ఇల్లు మొత్తం కాలిబూడిదైంది. సంఘటనా స్థలానికి రెవెన్యూ సిబ్బంది చేరుకుని జరిగిన నష్టాన్ని అంచనా వేశారు.

కుమ్మరిగుంటలో గజరాజుల గుంపు

- పట్టించుకోని అటవీశాఖ సిబ్బంది
- ఆందోళన వ్యక్తం చేస్తున్న అన్నదాత

కొమరాడ: ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే చేతికి వచ్చే సమయంలో గజరాజుల గుంపు సంచారంతో పంటనాశనం అవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగలంతా ఏనుగులు ఆర్తాం కొండపైకి వెళ్తాన్నాయి. రాత్రిపూట పంటపొలాల్లో సంచరిస్తున్నాయి. పదిహేను రోజులుగా కుమ్మరిగుంట, కందివలస గ్రామాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. అయితే కొమరాడ మండలంలోని కుమ్మరిగుంట, గంగిరేగువలస, స్వామినాయుడు, కందివలస, కళ్లికోట, దుగ్గి, గుణానుపురం తదితర గ్రామల్లో కూరగాయల సాగు ఎక్కువగా ఉంది టమాటో, క్యాబేజీ, చిక్కుడు, వంగతో పాటు జామ, బొప్పాయి, అరటి లాంటి వాణిజ్య పంటలు పండుతున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో గజరాజులు పొలాల్లో సంచరించడం వల్ల పంటలు నాశనమవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించే ఏర్పాట్లు అధికారులు చేయాలని కోరుతున్నారు.



కుమ్మరిగుంటలో టమాటో, అరటి తోటల్లో సంచరిస్తున్న ఏనుగుల గుంపు